# ఒడి

— అరిగే రామారావు



మన పుట్టుకా, బ్రతుకూ, చావూ-
డబ్బు ఖర్చుతో ముడిపడి
వుంది. పాతికా-ముప్పై రూపా

చితి చిటపటలాడుతూ గనగనా
మండుతూంది.
నలుమూలల్నుంచి ముసురు



యిల కట్టెలు లేనిదే ఆఖరికి చచ్చిన
శవం కూడ బుగ్గికాదు.

కుంటున్న చిమ్మ చీకట్లలో, ఆ
కాష్ఠంలోంచి పైపైకి లేస్తున్న

ఎర్రటి మంటలు- 'ఈ బొందిని వదిలిపోలేక ఆ 'జీవుడు' గిజగిజ లాడుతున్నాడా' అన్నట్లున్నాయి.

ఆ వల్లకాటిలోని చీకటంతా ఒక సముద్రమైతే, ఆ చీకటి సముద్రంలోంచి పుట్టిన బడబాగ్ని లాగా వుంది ఆ చితి!

ఏదో తప్పున ప్రేలిన శబ్దం.

శవంతో పాటు వచ్చిన వాళ్ళు, "కపాల మోక్షం జరిగింది. ఇక పోదాం పదండి!" అంటూ యిళ్ళకు పోవటానికి సిద్ధమయినారు.

వెట్టి పోలిగాడు- "మరో రూపాయి డబ్బులు దయసేపించండి దొరలూ! మీ పేరు సెప్పుకుని ఓ ముంత కల్లునీళ్ళు తాగుతా దొరలూ!" అంటూ, చేతులు నలుపుకుంటూ వాళ్ళ వెనుకపడ్డాడు.

"నీ కివ్వాల్సింది యిచ్చేశాం కదరా! ఇంకా ఏంట్రా?" అని ఎవరో అన్నారు.

శవం పూర్తిగా బుగ్గవ్వాలంటే రాత్రి పన్నెండవుతుందనీ, అప్పటిదాకా ఒక్కడే వల్లకాట్లో వుండాలంటే కల్లు త్రాగాలనీ ఏదేదో చెప్పాడు. కాని వాళ్ళు మాత్రం డబ్బులు రాల్చలేదు.

"పోనీ మా బుడ్డోడు కొనుక్కోవటాని కన్నా ఓ పావలా డబ్బులు యిప్పించండి దొరలూ!" తన వెనుకే వస్తున్న కొడుకు మట్టాయిని చూపించాడు.

మట్టాయికి పద్నాల్గు-పదిహేను సంవత్సరాలుంటాయి.

తండ్రి తలకు కొరివి పెట్టిన కొడుకు "లెక్కైంటే లెక్కే! ఒక్క పైసా కూడా పైన యిచ్చేది లేదు" అని విదిలించి కొట్టేడు.

ఇక లాభం లేదనుకొని పోలిగాడు నిలబడి పోయాడు. వాళ్ళు ముందుకు సాగిపోయారు.

వెట్టి పోలిగాడు 'థూ' అని వుమ్మేసి, "సీ, దొంగనాయాల్లారా! దినవారాలకు వందలొందలు కరుసు సేత్తారు-కాట్లో ఎట్టోడికి పావలా డబ్బు లిత్తానికి ఏడుత్తారు! థూ!" అన్నాడు అక్కసు పట్టలేక.

కల్లు నీళ్ళ పేరు చెప్పి పైడబ్బు లడిగేడు- డబ్బులు రాల్లేదు. నాలికయితే ఆ కల్లు నీళ్ళ కోసం పీకటం మొదలు పెట్టింది.

'నీయమ్మ కల్లు నీళ్ళు తాగి మూడ్రోజులయి పోయింది" అనుకున్నాడు.

ఇంతలో, "ఓరి మట్టాయిగా!" దూరంగా గాలి వాలులో ఒక కేక వినిపించింది.

"ఓఁయ్, వత్తన్నా-వత్తాన్నా!" మట్టాయి బదులు కేకేసి, "అయ్యా! అమ్మ పిలుత్తోంది. నూకలికి

డబ్బులు తెమ్మంటూందే" అన్నాడు.

"ఇత్తాంలేవోయ్! దీనమ్మ ఇదొకటి! కాట్లోకి శవం రావటం ఆలిసెం,నాకలోయ్ అని సత్తది." చిరాగ్గా తుపుక్కుమని వుమ్మేశాడు.

వెట్టి పోలిగాడి గుడిశ ఆ స్మశానంకు వచ్చే డొంక మొగదల్లో వుంది. వాడి పెళ్ళాం నాగులు జాగ్రత్తయిన మనిషి. మొగుడు డబ్బులన్నీ తాగుడుకు తగలేస్తున్నాడని, ఏదైనా శవం రాగానే ఆ వచ్చే డబ్బుల్ని ఇలా కరాకండిగా వసూలు చేస్తుంది. ఏ రెండు మూడు రోజులకోగాని మళ్ళీ కాటికి శవం రాదు. ఈ లోపల పస్తులేకుండా ఆ డబ్బుల్తో ఇన్ని గంజినీళ్ళు కాసి, మొగుడుకూ, కొడుక్కూ పోస్తుంది.

పోలిగాడు కాలుతున్న కాష్టం దగ్గరకెళ్ళాడు.

కల్లుముంతలు చూచి తాగుబోతువాళ్ళు నాలికలు తడుపుకుంటున్నట్లు అందులోంచి ఎర్రటి మంటలు లేస్తున్నాయి.

వాడి మనస్సు కళ్ళు ముంత మీదకు పోతోంది. ఈ డబ్బులు ముట్టుకుంటే పెళ్ళాం వప్పుకోదు. మోరాయించి ఖర్చుచేస్తే,ఆతర్వాత కడుపు మాడుతుంది. పైడబ్బులు పడలేదు. కల్లు నీళ్ళకోసం నాలిక పీకుతూంది.

బొడ్లో పొగాకు కాడలు తీసి నోట్లో వేసుకుని, కొడుక్కు కొన్ని తుంపులు పెట్టాడు. ఏదో నిర్ణయాని కొచ్చినట్లు "ఈ నాయాల్ల గాళ్ళకు ఇట్టాగే సేయాలి" అని అన్నాడు.

ఇంతలో నాగులు మళ్ళీ కేకేసింది.

"దీనమ్మ, సెవు తెగిన మేక నాగావూరికేఅరుత్తుంది.ఈ డబ్బులు దాని మొకాన కొట్టి, నీవు బేగే రారా అయ్యా- నీతో పనుంది" అన్నాడు.

పోలిగాడు కాష్టంలోంచి కాలుతున్న కట్టెల్ని ఒక్కొక్కటే బయటికి లాగేశాడు. బొంగుతో సగం సగం కాలిన శవాన్ని ప్రక్కకు పొర్లించాడు.

ఆ శవం ఎంతో వికృతంగా వుంది. అది పిశాచాలు పీక్కుతింటూ సగంలో వదిలేసినట్లుగా వుంది. నక్కలూ కుక్కలూ వూడపీకేసిన దిష్టిబొమ్మలాగా వుంది. గవులు కంపు కొట్టుతూంది.

గుడిసెకెళ్ళి మళ్ళీ లగెత్తుకొచ్చిన మట్టాయి దాన్నిచూచి అదిరిపడ్డాడు- "ఏంటి అయ్యా ఇది?" అన్నాడు.

వెట్టిపోలిగాడు బలాబలా నవ్వి, "ఓరెర్రెధవా! శవాన్ని సూసి వానుకుతున్నావు — కటికెట్టోడి కొడుకువేరా నీవూ?" అన్నాడు.

మళ్ళీ- "అట్టా సిత్తరం సూస్తూ నిలుసుండిపోయావేంటిరా ఎర్రి నా కొడకా! ఆ కుండట్టుకెళ్ళి కుంటలో నీళ్ళు ఎత్తుకువచ్చి ఆ కట్టెలార్పు రశే!" అని పురమాయించాడు.

మట్టాయి నీళ్ళు తీసికొచ్చి కట్టెలు ఆరుపుతున్నాడు.

పోలిగాడు చేతులు కాలకుండా పై గుడ్డతో శవం కాళ్ళు పట్టుకుని దాన్ని ప్రక్కనే వున్న పాడుబావి దగ్గరకు ఈడ్చుకెళ్ళాడు. వడుపుగా బావిలో పలికి తోసేశాడు.

ఆ బావి పాతాళరాక్షసి నోరు తెరచుకున్నట్లుంది. చీకిరిబాకిరి మొక్కలతో పట్ట పగలే అది చీకటి గుయ్యారంగా వుంటుంది. ఈ దిక్కుమాలిన శవం ఆ పాతాళ రాక్షసికి ఆహారమయిపోయింది.

మట్టాయి వాళ్ళయ్య చేస్తున్న దంతా చూస్తున్నాడు.

"ఆ నాయాళ్ళు కిట్టలో కలప టానికి రేపుమళ్ళీ అత్తికలు కోసరం వత్తారు. అక్కడున్న బుగ్గిలోంచి కాసిని బొమికలు ఏరుకురారా!" అన్నాడు.

మట్టాయి వుషారుగా ప్రక్కనున్న బూడిదలోంచి ఎముకులు ఏరుకొనివచ్చాడు. పోలిగాడు వాట్ని ఈ బూడిదలో అక్కడా యిక్కడా సర్దేశాడు.

కట్టెల్ను మోపుగాకట్టి కొడుకు నెత్తిమీద పెట్టి, "ఇక పదరా బుల్లోడా!" అన్నాడు.

అయ్యా, కొడుకు లిద్దరూ చీకట్లో అడ్డదారిన వూరిబయట వున్న చెక్ పోస్ట్ కేసి వడివడిగా నడిచేరు.

నాయర్ పాకహోటల్ వూరి బయట చెక్‌పోస్టు దగ్గర వుంది. అందులో ఎప్పుడూ వేటపలావు వేడివేడిగా దొరుకుతుంది. లారీ వాళ్ళు అక్కడ ఆగి వేటపలావు తింటారు.

నాయర్ దొడ్డితలుపు మీద టక టకా మంది.

నాయర్ పడుచుపెళ్ళాం వెళ్ళి తలుపు తీసింది. వెట్టిపోలిగాడు, మట్టాయి చీకట్లో నక్కి నిలబడ్డారు.

పోలిగాడ్ని గుర్తుపట్టి నవ్వి- "నీవా?" అంది. కట్టెలు వేయించు కుంది.

పమిటను నిలవనీయని ఆమె పడుచుగుండెలకేసి మట్టాయి దొంగ చూపులు చూశాడు.

నాయర్ నాల్గురూపాయిలు పోలి గాడి చేతిలో పెట్టి, "ఈ మధ్య బొత్తిగా కట్టెలు తేవటం లేదే?

అప్పుడప్పుడు తెస్తుండు" అన్నాడు.

ఆ కట్టెల్ను అడితిలో కొంటే పదిరూపాయి లవుతాయి.

"ఎప్పుడూ కుదురుద్దా? ఏదో అదాట్టుగా అన్నీ ఇట్టా కూడొత్తే.." అన్నాడు పోలిగాడు.

అక్కడ్నుంచి యిద్దరూ మంగమ్మ కల్లుపాక కెళ్ళారు.

పోలిగాడు తను మూడు సీసాలు త్రాగి కొడుక్కు ఒక ముంతను పోయించాడు. మట్టాయికి ఇంకా త్రాగాలనిపించింది. ఒక ముంతడు కల్లు ఏ మూలకు? త్రాగితే పూటుగా త్రాగాలి.

తూలుతూ, బూతులు తిట్టుతూ వచ్చిన మొగుడ్ని చూచి నాగులు- "సీ, వెదవ జల్మం!" అంది.

మట్టాయి కట్టెలు సంగతి తల్లితో చెప్పి, "సూడే అమ్మా! నా సేత కట్టెలు మోయించి ఒక్క ముంతడే యిప్పించాడు" అన్నాడు ఫిర్యాదు చేస్తున్నట్లు.

"నీవూ తాగావా?" అని వాడ్ని నాల్గు వుతికింది. 'సీ, ఈయమ్మ కేట్టి తెల్డు' అనుకున్నాడు మట్టాయి.

"నీవు సెడేది కాకుండా పసోడ్ని కూడా ఎందుకు సెరుపుతావు? నీకు బుద్ధీ, గేనం వుందా?" అంది కోపంగా.

"ఏందే నీ యమ్మ- ఎట్టోడి కొడుకు కల్లు తాగక పాయసం తాగుతాడేంటే?" అన్నాడు.

"అడ్ని బడికి పంపిత్తే సక్కగా సదువుకొని పెద్దోడయి వుజ్జోగం సేసి పాయసమే తాగుతాడు- పరామాన్నమే తింటాడు" అంది.

పోలిగాడు బలబలా నవ్వేసి, "ఓస్నీయమ్మ! ఆ సదువులు పెద్ద కులాలోల్లకే- ఎట్టోళ్ళ కెందుకే? ఆడ్ని నా సేతికిందెట్టుకుని నా అంతోడ్ని సేత్తా, నీ వట్టా సూత్తుండు" అన్నాడు గర్వంగా.

ఏడాది తిరగకుండానే మట్టాయి తనంతటోడు అవటమే కాదు, తనను మించి పోయాడు. చిత్తుగా త్రాగటం, జులాయి తిరుగుళ్ళు తిరగటం నేర్చుకున్నాడు. తనకు ఆసరాగా వుండకపోవడమటుంచి, యింటిపట్టునే వుండటం లేదు.

ఒకటి రెండు సార్లు తనకే కల్లు సీసాలు తెచ్చి యిచ్చాడు. తను సంతోషించాడు. ఆ తర్వాత ఒకసారి పగటిపూట వచ్చి కాల్లో కాలుతున్న శవాన్ని చూచి, "అయ్యా! బాయిలో సూకుదామే?" అన్నాడు.

"ఓర్నాయినో! ఈ వేళప్పుడే? నా కూట్లో దుమ్ము కొట్టకురోయ్ తండ్రీ!" అన్నాడు.

"వృత్త పిరుగ్గొడ్డువు అయ్యా నీవు!" అని తన దార్ని తాను పోయాడు.

ఆ తర్వాత ఒక రోజు రాత్రి చెక్‌పోస్ట్ దగ్గర ఆగిన లారీల్లోంచి సరుకు కాజేస్తున్నారని మట్టాయిని, మరో కుర్రాడ్నీ పట్టుకుని లారీ డ్రైవర్లు బొక్కలిరగ తన్నారు. ఇది విని వెట్టి పోలిగాడు తల పట్టుకున్నాడు.

"ఇప్పుడేడుస్తే ఏం లాభం? నీవు నేర్పించిన బడేగా?" అంది పెళ్ళాం.

'అడ్ని తనే తన సేతులారా సేరిపేనేమో?' అనుకున్నాడు.

* * *

పెళ్ళాం శవం ముందు కూల బడి కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్న వెట్టి పోలిగాడికి ఈ గతమంతా కళ్ళ ముందు మెదిలింది.

ఆ మధ్యాహ్నప్పూట తాటిమట్ట లేరుకొని రావటాని కెళ్ళిన తన పెళ్ళాన్ని పాము కరిచింది. మందూ, మంత్రమూ వేసే లోపలే నురుగులు క్రక్కుకొని ప్రాణాలొదిలింది.

తన బ్రతుకు బుగ్గయింది. ప్రాణా ఉండగానే తనని కట్టేసి తగలేసినట్లయింది. తను దిక్కు మాలినోడయిపోయాడు.

తనని తన 'పేనంలో పేనం'గా చూసుకునే పెళ్ళాం అకస్మాత్తుగా చనిపోయిందని ఒక దుఃఖం, కన్న తల్లి తలకు కొరివి పెట్టటానికి సమ యానికి లేకుండా పోయాడే కొడుకు అన్న దుఃఖం మరో వయిపు. ఎక్కడికి పోయాడో ఏమో, నాల్గు రోజుల్నుంచి మట్టాయి అజా పజా లేడు. ఈ రెండింటిని మించిన దుఃఖం- పెళ్ళాం శవాన్ని కాలేయ టానికి కట్టెలు లేకపోవటం. వెట్టోడి పెళ్ళామయినా చనిపోయాక కాట్లోకి రావాల్సిందే; కాట్లో కాలె య్యాలంటె కట్టెలు కావాల్సిందే! ముందే చెప్పినట్లు పాతిక, ముప్పై రూపాయిల కట్టెలు లేనిదే చచ్చిన శవం కూడా బుగ్గి కాదు.

ఇన్ని రకాల దుఃఖాలను దిగ మ్రింగలేక కుళ్ళి కుళ్ళి ఏడుస్తు న్నాడు.

పగోడికి కూడా ఇలాంటి పరి స్థితి రాకూడదనుకున్నాడు. కాలే కాలే శవాలను బావిలోకి నూకటం పాపమనీ, ఆ పాపం ఎప్పుడో మనల్ని కొట్టి తీరుతుందనీ ఆ భార్య వాపోయేది. ఆ పాపం ఈరోజు ఇలా కొట్టిందన్నమాట!

తన చేతులు మీదుగా ఎన్నో శవాలను బుగ్గిచేసిన తను ఆఖరికి తన భార్య శవాన్ని కాలేయటానికి కట్టెలు లేకా, అవి కొనటానికి

పాతిక రూపాయలు లేకా ఎన్ని చోట్లో తిరిగేడు; ఎందరెందర్నో అడిగేడు. అదేం పాపమో, ఎక్కడా ఒక్క రూపాయి కూడా పుట్టలేదు. కట్టెలన్నా ఇవ్వమనీ, తర్వాత ఇంతకు రెట్టింపు కట్టె లిస్తాననీ నాయర్ కాళ్ళా వేళ్ళా పడ్డాడు. కట్టెలు కొనడమే గానీ యివ్వటం లేదన్నాడు నాయర్.

ఏదన్నా తెగ నమ్ముదామంటే గుడిశలో కుండలూ, కుక్కి మంచమూ తప్ప ఏమీ లేవు. అమ్మితే రూపాయీ, పరకా వచ్చే బొచ్చు బోలి-కొడుకు త్రాగుడుకూ, తన త్రాగుడుకూ ఎప్పుడో చెల్లి పోయాయి. చివరికి చేసేది లేక పెళ్లాం వంటిమీద చిన్నదీ- చితకా ఏదైనా వుందేమోనని వెతికాడు. తను దిక్కుమాలినోడని పెళ్లాంకు తెలుసు. తనని కాలేయటానికి కావల్సిన కట్టెలు కోసం ముక్కున ఒక బేసర వుంచుకుంది.

దాన్ని అమ్మితే పదిహేను రూపాయి లొచ్చేసరికి గగనమై పోయింది. వాటికి సందెడు కట్టెలు కూడా రాలేదు.

బాలీచాలని ఆ కట్టెలతోనే చితి పేర్చి, శవాన్ని దానిమీద పండ బెట్టాడు.

అప్పటికే ముసిరిన చీకట్లు వల్లకాట్లో రాజ్యం చేస్తున్నాయి.

తలకు కొరివిపెట్టవల్సిన కొడుకు ఏ కల్లుపాకలో వున్నాడో? ఆ పని తనే చేశాడు.

ఏడ్చేవాళ్ళను చూడటమేగాని తనేనాడూ ఏడవలేదు. 'కటి కెట్టోడి కంట్లో కూడ నీళ్ళుంటా' యని చెప్పటానికా అన్నట్లు గుండెలవిసి పోయేటట్లు ఏడ్చాడు.

వల్లకాడే ఏడ్చినట్లయింది.

కాసేపటికి ఎలాగో దుఃఖాన్ని మ్రింగుకొని వెదురు బొంగు తీసుకుని అలవాటుగా కట్టెల్ని ఎగ దోశాడు. అవి సెగ తక్కువ సన్నెపి కట్టెలు. వాటితో పూర్తిగా శవం కాలదు, బూడిదా కాదు.

ఏదో గుర్తుకొచ్చి పోలిగాడు వడివడిగా తన గుడిశ వయిపు వెళ్ళాడు.

గుడిశ వెనుక చీకట్లో, తుప్పల్లో దేనికోసమో ఆశగా, ఆత్రంగా వెతికాడు.

ఒక తుంగ మొదలు కనిపించింది. తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు. గుడిశ లోపలికి వచ్చి చూరులో వెతికి గొడ్డల్ని తీశాడు. దానితో గబగబా ఆ తుంగమొదల్ని పగలేసి పేళ్ళు కొట్టి గంపకెత్తుకున్నాడు.

గబగబా స్మశానం వయిపు నడి చేడు.

మంట పూర్తిగా ఆరిపోయి నట్లుంది. అంతా చీకటిగా వుంది. ఆ చీకట్లో ఒక ఆకారం కనిపించింది.

"వోరాళ్ళు? వోరాళ్ళు?" అంటూ ముందుకు వురికేడు.

ఎదురుగుండా మట్టయ్య. నెత్తి మీద కట్టెల మోపు.

"ఈడ శవం ఏది రా?"

పోలయ్యకు మాట పెగల్లేదు.

"బాయిలోకి నూకేశా!" పొడిగా అన్నాడు మట్టయ్య.

"బాయిలోకి నూకేశావా? అది మీ అమ్మరా-మీ అమ్మ శవం రా!"

"అది అమ్మా! మా అమ్మా! మా అమ్మా!!" మట్టయ్య నెత్తి మీద మోపు కింద పడేసి కూలబడి పోయాడు. *

---

## రచయితలకు మనవి

'విజయ' లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు—ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరువారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ' లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్

'విజయ'

80- ధనలక్ష్మికాలనీ,

మద్రాసు-600 026